సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 25 । జనవరి । 2024



పోలమాంబ అనుపోత్సవం

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తుల ఆరాధ్యదైవం శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది.

- 10లో



పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- 10లో

ఔత్సాహికులందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ పిలుపునిచ్చారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

విజయనగరం అర్బన్: జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఐయాన్ డిజిటల్ కేంద్రం, బొబ్బిలి పరిధిలోని కలవరాయి వద్ద ఉన్న స్వామి వివేకానందా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 31 వరకు పరీక్షలు జరగనున్నవి. జిల్లా నుంచి 5,702 మంది అభ్యర్థులు దరఖాస్తుచేయగా, ప్రతి రోజూ 500 మంది పరీక్ష రాయనున్నారు.

న్యూస్‌రీల్

దళాయిపేట పంటపొలాల్లో గజరాజుల గుంపు



దళాయిపేట జొన్న చేనులో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ: మండలంలోని నాగవళి నది ఆ వైపు గ్రామాలైన దళాయిపేట గ్రామ పరిసరాల్లో గజరాజులగుంపు చేరుకున్నాయి. సీమనాయుడు వలస కూడలి నుంచి తొడుము వైపు వెళ్లే రహదారిపై ప్రయాణించేవారు అప్రమంతా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. ఏడు ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరిస్తోందని, రాత్రిపూట రైతులు పొలాల్లోకి వెళ్లారాదని హెచ్చరించారు.

ఎన్నికల ప్రక్రియలో సెక్టార్ అధికారులు కీలకం : జేసీ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: ఎన్నికల ప్రక్రియలో సెక్టారు అధికారుల విధులు కీలకమని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సెక్టారు అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సెక్టారు అధికారులు ఎన్నికల ప్రక్రియలో కీలకంగా వ్యవహరిస్తారని, వారు చేయవలసిన విధుల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలోనే సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలను పూర్తిగా పాటించాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించనున్నందున సిబ్బంది జాగురూకతతో వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పూర్తి శిక్షణ పొందాలని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు, కేఆర్‌సీ ఎస్‌డీసీ జి.కేశవనాయుడు, సెక్టారు అధికారులు పాల్గొన్నారు.

చిట్టంపాడులో వైద్యశిబిరం

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడులో బుధవారం మళ్లీ వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన చిన్నారి జన్ని శ్రావణ్ మృతితో కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్న విషయం తెలుసుకునేందుకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, ఆర్.ఆర్ టీమ్ సభ్యులు జనరల్ ఫిజీషియన్ బి.పద్మావతి, పిడియాట్రీషియన్ ఎస్.స్వాతి, పెథాలజిస్ట్ కె.సునీల్‌కుమార్, శ్రీనివాస్, కొట్టాం పీహెచ్‌సీ వైద్యులు జె.హారిక, బి.శిరీష, కొట్టాం వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దీర్ఘకాలిక రోగులు ఫ్యామిలీడాక్టర్ ద్వారా ఉచిత వైద్యసేవలు, మందులు పొందాలని సూచించారు. అనారోగ్యానికి గురైతే ఆర్‌ఎంపీలను ఆశ్రయించవద్దని, ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. పంచాయతీ పరిధిలోని 16 గ్రామాల్లోనూ వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు.

శరవేగంగా కులగణన



పార్వతీపురం పట్టణం 7వ సచివాలయం పరిధిలో కులగణన చేస్తున్న వలంటీర్లు

- క్లస్టర్ల పరిధిలో ఇంటింటా వివరాలు నమోదు చేస్తున్న వలంటీర్లు
- జిల్లాలో 350 సచివాలయాల పరిధిలో 5,665 క్లస్టర్లు
- జిల్లాలో 3,01,919 కుటుంబాలు
- 9,10,220 మంది జనాభా
- ఇప్పటి వరకు 4,99,818 మంది కులగణన పూర్తి

పార్వతీపురంటౌన్:

అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలంటే సమగ్ర కులగణన అవసరం. రాజ్యాంగ నిపుణుల సూచనల మేరకు దేశంలోని పలు రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు కులగణన చేస్తామని మాటల్లో చెప్పాయే తప్ప చేతలలో చేయలేకపోయాయి. ప్రజలకు మేలుచేయాలన్న తలంపుతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో కులగణన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పార్వతీపురం మన్యం జిల్లాలో కులగణన ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఈ నెల 28వ తేదీతో ముగియనుంది. తొలి దశలో ఇంటింటి సర్వే ప్రక్రియలో సచివాలయ ఉద్యోగి, గ్రామ వలంటీర్ భాగస్వామ్యం అవుతున్నారు. జిల్లా స్థాయిలో టెక్నికల్ నోడల్ అధికారి, సహాయ అధికారి సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు సహాయపడుతున్నారు. ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు.

పార్వతీపురంమన్యం జిల్లా రాష్ట్రంలో మూడోస్థానం

జిల్లాలో 350 సచివాలయాలు, 5,665 క్లస్టర్ల పరిధిలో వలంటీర్లు కులగణన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 3,01,919కుటుంబాలు ఉండగా, 9,10,220 మంది జనాభా ఉన్నారు. బుధవారం నాటికి జిల్లాలో 350 సచివాలయాల పరిధిలో కులగణన మొదలైంది. ఇప్పటివరకు 1,57,725 కుటుంబాలకు సంబంధించిన వివరాలు సేకరించి 4,99,818 మంది కులాలను నమోదు చేశారు. కుటుంబాల పరంగా చూస్తే 52.24 శాతం, జనాభాను బట్టి చూస్తే 50.26 శాతం నమోదుచేసి కులగణనలో రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా మూడో స్థానంలో నిలిచింది.

ముందంజలో గుమ్మలక్ష్మీపురం మండలం

జిల్లాలో కుటుంబాల పరంగా కులగణనలో గుమ్మలక్ష్మీపురం మండలం ముందంజలో ఉంది. 14,103 కుటుంబాలు, 9,560 మంది ప్రజల వివరాలు సేకరించారు. కుటుంబాల పరంగా 68 శాతంతో ప్రథమ స్థానంలో ఉంది. కురుపాం కుటుంబాల వారీగా 67 శాతం, పాలకొండలో 63 శాతం, సాలూరు 59 శాతం, సీతానగరంలో 54 శాతం, సీతంపేట, పాచిపెంట మండలాల్లో 53 శాతం కుటుంబాల చొప్పున కులగణనలో ముందున్నాయి.



పార్వతీపురం పట్టణం 13 వార్డులో కులగణన చేస్తున్న వలంటీర్లు

జిల్లాలో కులగణన వివరాలిలా..	
మండలాలు	15
సచివాలయాలు	350
క్లస్టర్లు	5,665
కుటుంబాలు	3,01,919
జనాభా	9,10,220
కుల గణన పూర్తిచేసిన వారి సంఖ్య	4,99,818
కుటుంబాల ప్రకారం పూర్తిచేసిన శాతం	52.24 శాతం
జనాభా ప్రకారం పూర్తిచేసిన శాతం	50.26 శాతం

సర్వే నిర్వహణ ఇలా..

- సమగ్ర కులగణన సర్వే పూర్తిపారదర్శకంగా చేస్తున్నారు. కుటుంబ సభ్యులు వెల్లడించిన వివరాలనే సర్వే సిబ్బంది చేస్తున్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఎవరి కులం వారికే నమోదు చేస్తారు.
- సర్వే సమయంలో కుటుంబం, జిల్లా, మండలం, గ్రామం వివరాలు సేకరిస్తారు. కుటుంబ సభ్యులు ఉన్నారా? మృతి చెందారా? లేక శాశ్వతంగా వలస వెళ్లారా? అన్న విషయాలు సేకరిస్తున్నారు.
- ప్రతి వ్యక్తి పేరు, వయసు, లింగం, భూమి (వ్యవసాయ-వ్యవసాయేతర), ఇంట్లోని పశువులు, వృత్తి, అన్నిరకాలుగా వచ్చే ఆదాయం, కులం, ఉపకులం, మతం, విద్యార్హత, నివాసం ఉండే ఇల్లు, మంచినీటి సదుపాయం, టాయిలెట్లు, గ్యాస్ ఉందా? లేదా? అనే వివరాలు సేకరిస్తున్నారు.
- కుటుంబ పెద్ద, ఇంటి చిరునామా, గృహ వివరాలు, ఎంతమంది నివసిస్తున్నారన్న వివరాలు నమోదు చేస్తున్నారు. కుటుంబ పెద్ద, ఇంటి చిరునామా సేకరిస్తారు.



సంగంవలస గ్రామంలో కులగణన చేస్తున్న వలంటీర్లు

సామాజిక వర్గాల వారీగా నమోదు



ఏ సామాజిక వర్గాలకు చెందినవారు ఎంత మంది ఉన్నారో తెలుసుకునేందుకు కులగణన ప్రక్రియ చేపట్టాం. కార్యదర్శులను క్లస్టర్ల వారీగా విభజించి వారికి వలంటీర్లను అనుసంధానం చేస్తున్నాం. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, తహసీల్దార్, ఎంపీడీఓ వంటి మండల స్థాయి అధికారులు భాగస్వాములుగా ఉన్నారు. డివిజన్ జిల్లా అధికారులను ఉపయోగించి వలంటీర్ అప్లికేషన్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు.

- రామచంద్రరావు, జీఎస్‌డబ్ల్యూఎస్, జిల్లా అధికారి, పార్వతీపురం మన్యం

సాలూరు టీడీపీలో... సిగపట్లు

- గుమ్మడి సంధ్యారాణి, భంజ్‌దేవ్ వర్గాల మధ్య అంతర్గత కుమ్ములాట
- జనసేన నేతల జోక్యంతో అగ్నికి ఆజ్యం
- శంబర జాతర సాక్షిగా ఫ్లెక్సీలతో యుద్ధం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

గిరిజన ముద్దుబిడ్డ పీడిక రాజన్నదొర కష్టం, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో సాలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా మారింది. నాలుగు దఫాలుగా తిరుగులేని విజయాలతో రాజన్నదొర సాలూరును తన అడ్డాగా మార్చుకున్నారు. మళ్లీ అక్కడ ఎలాగైనా టీడీపీ ఉనికి చాటుకోవడానికి ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఏకంగా రాజన్నదొరపై పసలేని ఆరోపణలను ఇటీవల అరకు సభలో సంధించినా గిరిజనం నుంచి పెద్దగా స్పందన లేదు. గాలిలో దీపం మాదిరిగా పరిస్థితి తారుమారు అయినా టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు మాత్రం తారస్థాయిలోనే జరుగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, మాజీ ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. పొత్తులో భాగంగా జతకట్టిన జనసేన నాయకులు ఇప్పుడు ఆ అగ్నికి ఆజ్యం పోస్తున్నారు. శంబర జాతర సందర్భంగా సాలూరు, మక్కువ మండలాల్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు ఆ కుమ్ములాటకు అద్దంపట్టాయి. 'వీళ్లు మారరురా' అంటూ టీడీపీ కార్యకర్తలే నొచ్చుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఆర్‌పీ భంజ్‌దేవ్, గుమ్మడి సంధ్యారాణి వర్గాల మధ్య అంతర్గత కుమ్ములాటల పంచాయితీ సాక్షాత్తూ చంద్రబాబు సమక్షంలోనే జరిగినా క్షేత్రస్థాయిలో ఏమీ మార్పు కనిపించట్లేదు. తమను టార్గెట్ చేసుకొని సంధ్యారాణి అనుచరులు పనిచేస్తున్నారని, పార్టీలో కలుపుకెళ్లే ప్రయత్నాలేవీ చేయట్లేదని భంజ్‌దేవ్ వర్గీయులు గళమెత్తుతున్నారు. వెనుకే ఉంటూ మోసం చేసే నాయకులను ముందుగానే దూరంపెట్టే పని సంధ్యారాణి చేస్తున్నారని ఆమె వర్గీయులు చెబుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు, లేఖలతో మొదలైన యుద్ధం పోలీసు స్టేషన్లలో ఫిర్యాదుల వరకూ వెళ్లింది. ఇది ఇప్పుడు ఫ్లెక్సీల యుద్ధంతో తారస్థాయికి చేరింది. సంధ్యారాణి తీరుతో విసిగిపోయామని, ఆమెకు టికెట్ ఇస్తే ఏమాత్రం సహకరించబోమని భంజ్‌దేవ్ వర్గీయులు బహిరంగంగానే చెప్పేస్తున్నారు.

తెరపైకి తేజోవతి...

సాలూరు టీడీపీ టికెట్ తనదేనని గుమ్మడి సంధ్యారాణి ధీమాగా చెబుతున్నప్పటికీ చంద్రబాబు ఇంకా స్పష్టంగా చెప్పకపోవడంతో ఆమె వర్గీయుల్లో సందేహం నెలకుంది. దీనికితోడు తేజోవతి రంగప్రవేశంతో ఇది మరింత పెరిగింది. ఇటీవల నూతన సంవత్సర వేడుకల్లో ఆమె భంజ్‌దేవ్ ఇంటి వద్ద



ప్రత్యక్షమవ్వడం సంధ్యారాణి వర్గీయులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. ఈ పరిస్థితితో భంజ్‌దేవ్ వర్గీయులు నిరాశ వదిలేసి కొత్త ఉత్సాహంతో పార్టీలో క్రియాశీలకమయ్యారు. తేజోవతి సాలూరు గడ్డపై కాలుపెట్టడం వెనుక టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చన్నాయుడి ప్రోత్సాహం ఉందని, ఆమెకు బొబ్బిలి నాయకుడు బేబీనాయన ఆశీస్సులు కూడా ఉన్నాయని చెబుతున్నారు. ఇటీవల బొబ్బిలిలో జరిగిన సభలోనే ఆమెకు టీడీపీ కండువా వేసి చంద్రబాబు పార్టీలోకి చేర్చుకోవడం వారి వాదనలకు బలం చేకూరుస్తోంది.

అగ్నికి ఆజ్యంపోస్తున్న జనసేన

తేజోవతికి మద్దతుగా ఉన్న భంజ్‌దేవ్ వర్గీయులను టార్గెట్ చేస్తూ ఇన్నాళ్లూ సంధ్యారాణి వర్గీయులు చేసినదాన్ని కన్నా అంతకుమించి జనసేన నాయకులు లక్ష్యంగా చేసుకున్నారు. దీంతో సంధ్యారాణి, భంజ్‌దేవ్ వర్గాల మధ్య అగ్నికి ఆజ్యం పోస్తున్నారు. తనను దూషిస్తూ సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్టుచేసిన జనసేన కార్యకర్త త్రిపురనేని విజయ్ చౌదరిపై సాలూరు టౌన్ పోలీసుస్టేషన్‌లో భంజ్‌దేవ్ ఫిర్యాదు చేశారు. ఇలాంటి కేసులకు తాను భయపడనని సదరు జనసేన కార్యకర్త మరో వీడియో పోస్టు చేయడం గమనార్హం.

ఫ్లెక్సీలతో యుద్ధం

శంబర జాతర సందర్భంగా భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ సాలూరు, మామిడిపల్లి, శంబర ప్రాంతాల్లో తేజోవతి వర్గీయులు ఫ్లెక్సీలను పెట్టించారు. ఆ ఫ్లెక్సీల్లో తేజోవతి ముఖాన్ని ఎవరో చింపేశారు. కొన్నిచోట్ల ముఖం కనపడకుండా ఆమె ఫొటోపై సంధ్యారాణి ఫొటోలను అతికించారు. మరోవైపు శంబరలో పెట్టిన ఫ్లెక్సీలో సంధ్యారాణి ముఖం కనిపించకుండా పసుపు రాసేశారు. గెలిచే అవకాశం లేనిచోట నాయకుల కొట్లాటను చూసి జనం నవ్వుకుంటున్నారు.



తేజోవతి ఫ్లెక్సీపై సంధ్యారాణి ఫొటో అతికించిన చిత్రం

గిరిజన సంస్కృతి ఏపీ అభివృద్ధికి దోహదం

- కేంద్రియ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లోని వైవిధ్యభరితమైన గిరిజన తెగల సంస్కృతి సంపద రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని కేంద్రియ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. స్థానిక యూనివర్సిటీలో 'గిరిజన చరిత్రపై రచనలు' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించే సదస్సుకు బుధవారం ఆయన అధ్యక్షత వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోయలు, సవరలు, ఎరుకులు, వాల్మీకి, జటావు, కొండదొరలు, గొండు వంటి వివిధ తెగలతో కూడిన ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజనుల చరిత్ర సుసంపన్నమైందని అన్నారు. వైవిధ్యభరితమైన ఈ తెగలు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడే విభిన్న సంస్కృతులు, భాషలు మరియు సంప్రదాయ పద్ధతులను కలిగి ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజనుల చరిత్ర మొత్తాన్ని నమోదు చేసి భావితరాలకు బదిలీ చేసే ప్రక్రియకు యూనివర్సిటీ శ్రీకారం చుట్టిందని తెలిపారు. మైసూర్‌కు చెందిన ప్రొఫెసర్ మల్లి గాంధీ మాట్లాడుతూ గిరిజనుల చరిత్ర వారి పద్ధతులు శాస్త్ర సాంకేతికపరంగా గొప్పవని రాబోయే రోజుల్లో సుఖంగా సంతోషంగా జీవించేందుకు సాంకేతిక ప్రపంచానికి ఇవి ఉపయోగపడతాయని అన్నారు. పాండిచ్చేరికి చెందిన ప్రొఫెసర్ బి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గిరిజన చరిత్ర మూలాలు, వలస పాలనా కాలంలో అవి ఎలా నమోదయ్యాయో వివరించి ఆదివాసీ చరిత్రను అద్భుతమైన పద్ధతులను ప్రజల దృష్టికి తీసుకురావడానికి శూన్యత నెలకొందన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ ఆంత్రోపాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ పీడీ సత్యపాల్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, డీన్ స్కూల్ అఫ్ సోషల్ స్టడీస్ ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, ఫైనాన్స్ ఆఫీస్ ప్రొఫెసర్ జేఎంమిశ్రా, డాక్టర్ అని రుద్‌కుమార్, గిరిజన అధ్యయన విభాగాధిపతి, డాక్టర్ దివ్య కొణికల్, సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ డి.నాగ్, నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

మన్యంలో అభివృద్ధి వెలుగులు

- జగనన్న పాలనలోనే సాధ్యమైంది..
- చంద్రబాబు, ఆయన దొంగల ముఠాను నమ్మొద్దు
- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజన కొండ కోనల్లో సంక్షేమ, అభివృద్ధి వెలుగులు విరజిల్లుతున్నాయని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలో తోణాం పంచాయతీలో దిగువ శెంబి నుంచి దిప్పలపాడు వరకు మంజూరైన సుమారు రూ.8 కోట్లతో 6.40 కి.మీ. బీటీ రోడ్డుకు, రూ.3 కోట్ల 85 లక్షలతో వ్యయంతో చేపట్టనున్న సారిక సాంపిగాం మధ్యగల బ్రిడ్జిల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సాంపిగాం బ్రిడ్జి సమీపంలో ప్రజలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు గిరిజన ప్రాంతాల్లో చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. అధికారంలో ఉండగా గిరిజన అభివృద్ధిని పట్టించుకోని చంద్రబాబు నేడు సిగ్గు లేకుండా గిరిజనుల కోసం మాట్లాడుతున్నారని విమర్శించారు. టీడీపీ హయాంలో సాలూరు నియోజకవర్గంలో కనీసం ఒక్క గిరిశిఖర గ్రామానికైనా రోడ్డు వేశారా? అని ప్రశ్నించారు. ఎన్నికల వేళ మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని దుయ్యబట్టారు. జగనన్న పాలనలో నేడు గిరిజన ప్రాంతాల్లో సంక్షేమ, ప్రగతి పవనాలు వీస్తున్నా యన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు నేరుగా గిరిజనుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిలు తదితర అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. గిరిజనాభివృద్ధికి కృషి చేస్తున్న జగన్‌మో హన్‌రెడ్డిని మళ్లీ ముఖ్య మంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. అంతకు ముందు రాజన్నదొరకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, నాయకులు ముువ్వల ఆదయ్య, గొర్లె సత్యవతి, వి.ఎండమ్మ, సుబ్బారావు, అమల, కళ్లేపల్లి త్రినాథరావు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

మన్యంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్
- ఆడలి వ్యూ పాయింట్, గిరిజన మ్యూజియం సందర్శన



ఆడలి వ్యూపాయింట్ వద్ద పర్యాటక పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. సీతంపేట పాత పీఎంఆర్‌సీ వద్ద నిర్మిస్తున్న గిరిజన మ్యూజియంను బుధవారం సందర్శించారు. గిరిజన సంస్కృతిని తెలిపే చిత్రాలు, గదులను పరిశీలించారు. రెస్టారెంట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కొన్ని గదులు షూట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆడలి వ్యూపాయింట్‌ను సందర్శించారు. ఆడలి గ్రామం నుంచి వ్యూపాయింట్ వరకు ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్డు సదుపాయం కల్పిస్తామని చెప్పారు. గిరిగ్రామ్ పథకం కింద ఒక గిరిజన గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామాన్ని పర్యాటకులు సందర్శించేలా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ట్రెక్కింగ్ అవకాశాలు పరిశీలిస్తామన్నారు. అంతకముందు ఐటీడీఏలోని పీఓ చాంబర్‌లో సీతంపేట ఐటీడీఏ ద్వారా చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులను పీఓ కల్పనాకుమారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, జేఎం హరేరాం, పర్యాటకాధికారి నారాయణరావు, ఈఈ సింహాచలం, డీఈ కృష్ణకుమార్, ఏఈ మోహన్‌గోపాల్, నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

జీడిపూత దశలో జాగ్రత్తలు అవసరం



తమ్మినేని అమరేశ్వరి, ఉద్యానవన శాఖాధికారిణి, పాలకొండ



సీతంపేట ఏజెన్సీలో పూతదశలో జీడి పంట

పాలకొండ రూరల్: ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ నియోజకవర్గం ప్రాంతంలో మామిడితోపాటు అధిక ప్రాధ్యానం కలిగిన వాణిజ్య పంటల్లో ఒకటైన జీడి ప్రస్తుతం పూత దశకు చేరుకుంది. ఈ తరుణంలో సంబంధిత తోటల సాగులో నిమగ్నమైన రైతులు అవసరమైన జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే ప్రస్తుత శీతాకాలంలో కురిసే తేనెమంచు, పొగమంచు, ఇతర కీటకాల కారణంగా పూత పాడయ్యే ఆస్కారం ఉంది. దీనిని అధిగమించేందుకు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఉద్యానవన శాఖాధికారిణి తమ్మినేని అమరేశ్వరి పేర్కొన్నారు.

కొమ్మ, పుష్పగుచ్ఛాలు తొలిచే పురుగు..

శీతాకాలం సీజన్‌లో పూతదశలో కొమ్మ, పుష్పగుచ్ఛాలు తొలిచే పురుగు కారణంగా దిగుబడి తగ్గే పరిస్థితి ఉంటుంది. ముఖ్యంగా టీ దోమ, కాయ తొలుచు పురుగు, తామరపురుగు, పిండినల్లి వల్ల నష్టం ఏర్పడుతుంది. ఈ పురుగులు లేత కొమ్మల చివర్లను తొలచి సారంగం చేసి లోపల గుజ్జును, పుష్పగుచ్ఛాలను తొలిచేస్తాయి. దీనికారణంగా కొమ్మలు, పూత ఎండిపోతుంది. కాయ, గింజల మధ్య ప్రదేశంలో ఆశించే పురుగులు పండులోని గుజ్జును, గింజలోని పప్పును తిని నష్టపరుస్తాయి. దీనికితోడు తామరపురుగులు ఎదుగుతున్న కాయలను, పండ్లను గీకుతూ రసం పీల్చడం వల్ల కాయలపై గరకు, మచ్చలు ఏర్పడి నాణ్యత తగ్గిపోతుంది. వీటిని నిర్మూలించేందుకు ఒక్కో మొక్కకు అర కేజీ యూరియా, 250 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 125 గ్రాముల వంతున అందించాలి. చెట్టు మొదలు వద్ద 4 అడుగుల దూరంలో పళ్లెం ఏర్పాటు చేసి ఈ మందులు వేసి నీరు పెట్టాలి. ప్రస్తుతం జనవరిలో పువ్వు, పిందె దశలో టీ దోమ ఆశించే అవకాశం ఉంది. దీనిని అధిగమించేందుకు మోనో క్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండోవ దశ ఫిబ్రవరి మొదటి వారంలో క్లోరిఫైరిపాస్ 2 మిల్లీలీటర్లు లేదా లామ్డాసైహలోత్రిన్ 0.6 మిల్లీలీటర్ లీటరు నీటిలో కలిపి మొక్కలకు పిచికారీ చేయాలి. మార్చి, ఏప్రిల్ నెలల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా తామర పురుగు నష్టం కలగజేస్తుంది. దీనిని అరికట్టేందుకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీలీటర్లు లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు లేక మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అన్ని దశల్లో వ్యాప్తి చెందే పిండినల్లిని అరికట్టేందుకు 2.5 మి.లీ. డైక్లోరోవాస్ లేదా డైమిథోయేట్ 2 మి.లీ లేక ఎసిఫేట్ 1.5 గ్రాముల లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఉద్యాన శాఖాధికారిణి సూచించారు.

క్లుప్తంగా

28న జానపద సాహితీ సౌరభం

విజయనగరం టౌన్: విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 28న ఆదివారం సాయంత్రం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో జానపద సాహితీ సౌరభం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. జ్ఞానపథంలో జానపద సాహిత్యం అనే అంశంపై గిడుగు రామమూర్తి తెలుగు భాషపై జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రికూర్మారావు వక్తగా ప్రసంగిస్తారని, సాహితీవేత్తలందరూ తప్పక హాజరుకావాలని పిలుపునిచ్చారు.

కార్పెంటర్ మృతిపై కేసు నమోదు

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామంలో కొమ్మోజు సత్తిబాబు(58) కార్పెంటర్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కర్రలు కోసే మెషీన్ కింద పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఈ ప్రమాదం జరిగిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ మేరకు మృతుడి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎస్‌కోట సీహెచ్‌సీకి తరలించినట్లు సీఐ వి.చంద్రశేఖర్ బుధవారం తెలిపారు.

బెదిరించేందుకు గడ్డి మందు తాగి వ్యక్తి మృతి


శంకరరావు (ఫైల్)

వీరఘట్టం: స్థానిక మందిరం వీధికి చెందిన ఆర్.శంకరరావు (28) భార్యను బెదిరించేందుకు గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.గోవింద బుధవారం తెలిపారు. ఈ సంఘటనపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నా,యి. ఎఫ్‌సీఐ కలాసీగా పనిచేస్తున్న శంకరరావు ఇటీవల జరిగిన సంక్రాంతి పండగ సందర్భంగా ఎక్కువ మోతాదులో మద్యం తాగడంతో భార్య అనూష మండిపడింది.ఇంతలా మద్యం తాగితే ఆరోగ్యం ఏమైపోతుంది? నీ మీద ఆధారపడి ఇద్దరు చిన్నపిల్ల లు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయి ఇలా మందు తాగడం కరెక్ట్ కాదని నిలదీసింది. దీంతో శంకరరావు ఈనెల 21న భార్యను బెదిరించేందుకు ఏం కాదులే అని కొద్దిగా గడ్డి మందు తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న బంధువులు స్థానిక పీహెచ్‌సీకి అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.గోవింద చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రంలోని మరిశర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని కేంద్రాస్పత్రికి తీసుకువచ్చేసరికి మృతిచెందాడు. ఈ మేరకు రూరల్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తిని జిల్లా కేంద్రాస్పత్రికి స్థానికులు తరలించగా ఆస్పత్రికి వచ్చేసరికి క్షతగాత్రుడు మృతిచెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి పోలీసులు తరలించారు. ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీసులను సంప్రదించాలని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాసుదేవ్ తెలిపారు.

రైలు ఢీకొని యువకుడు..


రైల్వే ట్రాక్‌పై యువకుడి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక సీఎంఆర్ షాపింగ్ మాల్ వెనుక రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడు మృతిచెందినట్లు జీఆర్‌పీ సిబ్బంది బుధవారం తెలిపారు. సుమారు 25 ఏళ్ల వయసు కలిగిన యువకుడిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడని మృతుడి శరీరంపై నీలం రంగు అడ్డుగీతల కలిగిన తెలుపు షర్ట్, ఆర్మీ డిజైన్ కలిగిన కట్ బనియన్, నల్లని జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని చెవులకు చెవి పోగులున్నాయని, ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9666555214 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై రవివర్మ సూచించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల–రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక చంపావతి నది వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తితో పాటు గర్భిణికి పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామతీర్థం గ్రామానికి చెందిన దన్నాన రాంబాబు తన భార్య శ్యామలను వైద్యం నిమిత్తం ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా..కొత్తపేటకు చెందిన సూర్యనారాయణ ఇసుకలోడు వేసుకుని టైరు బండితో రాంగ్ రూట్‌లో వచ్చి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు కింద పడిపోవడంతో భర్త రాంబాబు ఛాతీ పైనుంచి ఇసుక బండి వెళ్లిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు చికిత్స నిమిత్తం రాంబాబును ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామగణేష్ తెలిపారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్

• ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఐటీడీఏ సి.విష్ణు చరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలోని గిరిమిత్ర భవనంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీఓ పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడడం వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారతదేశం 5వ స్థానంలో ఉందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే పారిశ్రామికవేత్తలు పెరగాలని ఆకాంక్షించారు. పరిశ్రమ పెట్టాలంటే మూలధనం అవసరమని, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి భారత ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశం కలగాలంటే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీఓ సూచించారు. దేశాభివృద్ధిలో వ్యవసాయంతో పాటు సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు.

'ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుని పారిశ్రామికవేత్తలు కావాలని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన వారికి భారత ప్రభుత్వం మొదటి విడతగా 5 శాతం వడ్డీతో లక్ష రూపాయలు బ్యాంక్ ద్వారా రుణం అందజేస్తుందని తెలిపారు. తీసుకున్న రుణాన్ని 18 వాయిదాలలో తిరిగి బ్యాంక్‌లకు చెల్లించాలని, రెండవ విడతగా రూ.2 లక్షల రుణాన్ని అందిస్తుందని వివరించారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కరుణాకర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం పనిచేస్తుందని చెప్పారు. 18 రకాల చేతి పనివారు ఉన్నారని వారికి ప్రభుత్వం 15 వేల రూపాయల విలువైన పనిముట్లను ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తోడ్పాటు

జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులందరికీ భారత ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆర్థిక సాయం చేస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తోడ్పాటు అందిస్తోందన్నారు. జిల్లాలో అర్హత ఉండి ఆర్థికంగా వెనకబడిన వారు సత్వరం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మన్యం జిల్లాను మాన్యం జిల్లాగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత జిల్లాలోని ఔత్సాహికవేత్తలపై ఉందన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ సహాయ పథక సంచాలకుడు సత్యం నాయుడు మాట్లాడుతూ చేతి వృత్తుల వారిని ప్రోత్సహించేలా ఈ పథకం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలో సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురంలలో నాలుగు నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థలు ఉన్నాయని తెలిపారు. అక్కడ శిక్షణ తీసుకునే వారికి ఉచితంగా వసతి, భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి ఎంపికైన వారికి 5 నుంచి 7రోజులు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. వారికి ప్రోత్సాహకంగా రోజుకు రూ.500 భారత ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌సీ ప్రెసిడెంట్ పి.నాగకుమార్, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీకి సంక్రాంతి కానుక

• మూడు డిపోల పరిధిలో 471 ప్రత్యేక బస్సుల సేవలు
• రూ.95.09 లక్షల ఆదాయం

జిల్లాలో సంక్రాంతి ఆదాయం ఇలా..

డిపో	బస్సులు	ఆదాయం
పాలకొండ	217	రూ.3654044
పార్వతీపురం	155	రూ.3860799
సాలూరు	99	రూ.1994937
మొత్తం	471	రూ.9509780


పార్వతీపురం డిపోలో ఆర్టీసీ బస్సులు

పార్వతీపురంటౌన్: సంక్రాంతి పండగకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడపడం ద్వారా పార్వతీపురం జిల్లా ఆర్టీసీ రికార్డు స్థాయిలో ఆదాయాన్ని పొందింది. జిల్లాలోని మూడు డిపోల ద్వారా ఈనెల 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయగా పండగ ముందు, తర్వాత సాధారణ చార్జీలకే బస్సులు నడిపింది. ఈ ఏడాది పండగకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయడానికి ఎక్కువమంది మొగ్గు చూపడంతో ఈ ఆదాయం సాధ్యమైంది. దీంతో ఆర్టీసీ ప్రయాణికులకు మరింత చేరువైంది.

పండగకు ముందు, తరువాత

సంక్రాంతి పండగ ముందు జనవరి 10 తేదీ నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం నుంచి జిల్లాకు మొత్తం 216 ప్రత్యేక బస్సులు సర్వీసుచేయగా రూ 44.86 లక్షల ఆదాయం లభించింది. అలాగే పండగ దరువాత 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జిల్లాలోని మూడు డిపోల నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నానికి 255 ప్రత్యేక బస్సు సర్వీసులు చేయగా రూ.50.23లక్షల ఆదాయం లభించింది

'ఆదాయం లభించడం సంతోషం



సంక్రాంతి పండగకు ఆర్టీసీకి జిల్లా వ్యాప్తంగా మంచి ఆదాయం లభించడం సంతోషం. పండగ సందర్భంగా ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు బాగా ఆదరించారు. పండగకు ముందు, పండగ తరువాత కూడా ప్రత్యేక బస్సులను నడిపాం. అలాగే సాధారణ చార్జీలకే సర్వీసు చేశాం. ప్రయాణికులు ఇచ్చిన ప్రోత్సాహంతో మున్ముందు ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు చేపడతాం.

– టీవీఎస్ సుధాకర్, జిల్లా ప్రజా రవాణా అధికారి పార్వతీపురం మన్యం

ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట

సంక్రాంతి పండగకు ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణికులను అడ్డంగా దోచుకోవడం సర్వసాధారణం. అయితే పండగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి సాధారణ చార్జీలు, ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా చేసి ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ బారినుంచి రక్షించింది.

చీటింగ్ కేసుల్లో రికవరీ చేయాలి


ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న నెల్లిమర్ల ఎస్సై రామగణేష్



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

• నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన చీటింగ్ కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేయాలని, నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఆస్తులను కూడా రికవరీ చేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లోల పనిచేస్తున్న పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం ఆమె పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోగల క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను, గ్రామాలను సందర్శించాలని, ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించేందుకు ఆస్కారం ఉన్న రౌడీషీటర్లను, వ్యక్తులను గ్రామస్థాయిలో గుర్తించి, వారిని బైండోవర్ చేసి, బాండ్లు తీసుకోవాలని సూచించారు.

పలు కేసులపై సమీక్ష

సమస్యాత్మక గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని, శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అక్రమంగా మద్యం విక్రయించే వారిపైన, రవాణాకు పాల్పడే వారిపైన కఠినచర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల దృష్ట్యా ఏర్పాటుచేసిన చెక్ పోస్టులను అధికారులు సందర్శించి, ఆకస్మిక తనిఖీలు చేయాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల ప్రచారం కోసం అనుమతులు కోరుతూ వివిధ పార్టీల నాయకులు చేసే దరఖాస్తు వివరాలను నమోదుచేసేందుకు ప్రత్యేకంగా ఒక రిజిస్టర్‌ను ప్రారంభించాలని చెప్పారు. అనంతరం దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించారు. వాటిపై దర్యాప్తు పూర్తిచేసేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి దర్యాప్తు అధికారులకు దిశానిర్దేశం చేశారు. వివిధ రకాల కేసుల నమోదు, పరిష్కారంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రశంసపత్రాలు పొందిన వారిలో గజపతినగరం ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న ట్రైయినీ డీఎస్పీ ఎస్.మహేంద్ర, నెల్లిమర్ల ఎస్సై రామగణేష్, కొత్తవలస ఏఎస్సై యువరాజ్, స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీ జి.రామరాజు, వంగర హెచ్‌సీ డి.రాములు, విజయనగరం రూరల్ హెచ్‌సీ ఎం.అప్పారావు, ఇతర పోలీసు కానిస్టేబుల్స్, హోంగార్డ్స్ ఉన్నారు. నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎస్ఈబీ డీఎస్ఎన్ఓ ఎస్.వెంకటరావు, ట్రైనీ ఐపీఎస్ మండ జావలి అల్ఫాన్స్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లకు మ్యాపింగ్ తప్పనిసరి

• జాయింట్ కలెక్టర్ గోవిందరావు


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు

పార్వతీపురంటౌన్: జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లకు మ్యాపింగ్ తప్పనిసరి అని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్ట్ గోవిందరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయాన్ని పరి శీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 28న జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసే ఇళ్లకు మ్యాపింగ్ తప్పనిసరిగా ఉండాలని సిబ్బందికి సూచించారు. రెవెన్యూ సిబ్బంది ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను చేపట్టాలని కోరారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలను 28వ తేదీలోగా సేకరించి మ్యాపింగ్ పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ హేమలత, తహసీల్దార్ శివన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ వేగవంతం చేయాలి


లబ్ధిదారుకు ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ వేగవంతం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. ఈ మేరకు బుధవారం ఆమె రాజాం మండల పరిధి బొద్దాం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసి కార్డుల పంపిణీపై ఆరా తీశారు. కార్డుల పంపిణీ నెమ్మదిగా జరుగుతుండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 5.2 లక్షల కార్డులు పంపిణీ చేయాల్సి ఉందని, ప్రస్తుతం 3.3 లక్షల కార్డులు వచ్చాయని వాటిని వీలైనంత త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే కార్డుల్లో మార్పులు చేర్పులతోపాటు కొత్తవారిని చేర్పించేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డులతోపాటు కరపత్రాలను లబ్ధిదారులకు అందించాలని, అలాగే ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఓ లబ్ధిదారుకు ఆమె కార్డును అందించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న కులగణన సర్వే ప్రక్రియను పరిశీలించి, వలంటీర్ల వద్ద ఆరా తీశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఆర్ఓ సుధారాణి, కులగణన నోడల్ ఆఫీసర్ కె.సందీప్, ఆర్డీఓ బి.శాంతకుమారి, తహసీల్దార్ ఎస్‌కే రాజు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, నగర పంచాయతీ కమిషనర్ ఎంవీ నాగరాజు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను బ్యాంకర్లు అనుసరించాలి

• జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: వ్యవసాయ, అనుబంధ రంగాలైన మత్స్య, పశు, ఉద్యాన రంగాలలో రైతులకు రుణాలను మంజూరు చేసేటప్పుడు నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారంగానే మంజూరు చేయాలని జేసీ మయూర్ అశోక్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీసీసీబీ ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌పై పలు శాఖలకు చెందిన అధికారులతో చర్చించి నిర్ణయించారు. పాడి, మత్స్య, యూనిట్లకే కాకుండా ఇంకా ఏ రకాలైన రుణాలు ఇస్తున్నారో, వాటికి ఏ మేరకు రుణం అవసరం అవుతుంతో ఆయా అధికారులు ప్రతిపాదనలను డీసీసీబీకి అందజేయాలని ఆదేశించారు. ఆయిల్‌పామ్, అపరాల సాగు, పశుగ్రాసం తదితర యూనిట్లకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించాలని కోరారు. సమావేశంలో డీసీసీబీ సీఈఓ కె.జనార్దన, ఎల్‌డీఎం ఎ.శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీఎం నాగార్జున, వ్యవసాయ, మత్స్య ఉద్యాన పశు సంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరు మహిళల అరెస్ట్


పట్టుకున్న సారా ప్యాకెట్లతో పాటు నిందితులు

పాచిపెంట: అక్రమంగా సారా రవాణా చేస్తున్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసినట్లు ఎస్సై నారాయణరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద సారా తరలిస్తుండగా ఒడిశా రాష్ట్రంలోని లావిడికి చెందిన సుకురా, హంటర్‌లు పట్టుబడ్డారని తెలిపారు. వారి నుంచి 1000 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

ఘనంగా పోలమాంబ అనుపోత్సవం

• వనంగుడికి చేరిన అమ్మవారి ఘటాలు


పెదపోలమాంబ ఆలయంలో ఉంచిన ఘటాలు


అమ్మవారి ఘటాలకు ఉయ్యాల కంబాల నిర్వహిస్తున్న దృశ్యం


అనుపోత్సవంలో పాల్గొన్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తుల ఆరాధ్య దైవం శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం 3.51గంటలకు జన్నివారి ఇంటివద్ద పూజలందుకున్న అమ్మవారి ఘటాలు తిరువీధికి బయల్దేరి గిరిడవారు, పూడి, కుప్పిలి వారిళ్లకు వెళ్లి తొలి పూజలందుకుని అనంతరం గ్రామంలోని అన్నివీధుల్లో ఊరేగాయి. తిరిగి మంగళవారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో ప్రధానరహదారి వద్ద గల అమ్మవారి గద్దెకు ఘటాలు చేరుకున్నాయి. కాసేపు అమ్మవారు సేద తీరి తిరిగి తిరువీధికి బయల్దేరి, బుధవారం ఉదయం 9.20గంటలకు ప్రధానాలయం సమీపంలో ఉన్న యాత్రాస్థలానికి చేరుకున్నాయి. ఈవో వి.వి.సూర్యనారాయణ, దేవాదాయశాఖ సిబ్బంది, మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్లు పూడి దాలినాయుడు, వసంతుల భాస్కరరావు, గంజి కాశినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, రెవిన్నాయుడు, కరణం, కుప్పిలి, గిరిడ వారి కుటుంబసభ్యులు, గ్రామపెద్దలు, భక్తుల మధ్య అమ్మవారికి ఉయ్యాల కంబాల కార్యక్రమం నిర్వహించారు. యాత్రాస్థలం నుంచి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న వనంగుడికి అమ్మవారి ఘటాలు బయల్దేరగా, వెనుక వందలాది మంది భక్తులు తరలివచ్చారు.

జాతర ఆదాయం లెక్కింపు

శంబర పోలమాంబ అమ్మవారి తొలిజాతరలో వేలంపాటల ద్వారా, దర్శనం టిక్కెట్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం ప్రధానాలయంలో లెక్కించారు. తొలిజాతర, 30న జరిగే మారు జాతరలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈనెల 31వతేదీన లెక్కించనున్నట్లు ఈవో సూర్యనారాయణ తెలిపారు. గత ఏడాది కంటే ఈఏడాది తొలిజాతర ఆదాయం రూ.2,60,245లు పెరిగిందని ఈఓ చెప్పారు.

ఎండీయూ ఆపరేటర్ ఆత్మహత్యపై దర్యాప్తు


గుమ్మగదబవలస గ్రామంలో దర్యాప్తు నిర్వహిస్తున్న పాలకొండ ఆర్డీఓ లావణ్య

కురుపాం: మండలంలోని గుమ్మ ఎండీయూ ఆపరేటర్ ఆత్మహత్యకు పాల్పడడానికి ముఖ్య కారణం అధికారులు, సేల్స్‌మన్ ఒత్తిడే కారణమని మృతుడు సీమల నూకయ్య(36) కుటుంబసభ్యులు ఆరోపించడంపై మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందించారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించడంతో పాలకొండ ఆర్డీఓ ఎం.లావణ్య బుధవారం మృతుడి స్వగ్రామమైన మండలంలోని గుమ్మపంచాయతీ గుమ్మగదబవలస గ్రామానికి వెళ్లి దర్యాప్తు నిర్వహించారు. నూకయ్య భార్య జ్యోతి, ఇతర కుటుంబసభ్యులు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. పూర్తి నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ దర్యాప్తులో కురుపాం తహసీల్దార్ రమేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు మాతృవియోగం


దాడి చిలక మంగమ్మ

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు తల్లి దాడి చిలక మంగమ్మ (80) బుధవారం సాయంత్రం విజయనగరంలో మృతి చెందారు. అనారోగ్యంతో ఉన్న ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చగా సాయంత్రం 4.30 గంటల సమయంలో ప్రాణం విడిచినట్లు ఎస్టీ కమిషన్ క్యాంప్ కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఆమె పార్థివదేహాన్ని నగరంలోని కామాక్షినగర్‌లో ఉన్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు నివాసంలో ఉంచారు. మంగమ్మకు డాక్టర్ శంకరరావుతోపాటు ఉపాధ్యాయులు శ్రీరామ్, శ్యామ్ కుమార్‌లున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

బొబ్బిలి: శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్ పేట మండలం చిన్న కొల్లివలసకు చెందిన పెంకి అరుణ(33) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటనపై బొబ్బిలి ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా ఆకలి లేకపోవడం, జ్వరంతో బాధపడుతున్న అరుణ తన పుట్టినిల్లయిన బొబ్బిలి మండలంలోని పెంట గ్రామానికి కొన్ని రోజుల క్రితం వచ్చింది. ఆమెకు ఒంట్లో బాగుండకపోవడంతో కన్నవారు బొబ్బిలిలోని ఆస్పత్రులకు తీసుకెళ్లారు.అయినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వైద్యులు మృతిపై అనుమానంతో పోలీసులకు సమాచారమివ్వగా పోలీసులు మృతదేహాన్ని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త వెంకటరమణ, కుమారుడు నవీన్(17), కుమార్తె రమ్య(15) ఉన్నారు.